# చెరిగిన కథ

- డి.కామేశ్వరి

ఆఫీసునించి వచ్చి విసుగ్గా సోఫాలో వాలిపోయిన రాజారావుని చూసి, "ఏమిటలా వున్నారు, మొహం వాడిపోయింది. వంట్లో బాగులేదా ఏం?" కాఫీ గ్లాసుతో వచ్చిన శకుంతల అంది.

"ఏం లేదు, బాగానే వుంది" ముభావంగా అని గ్లాసందుకున్నాడు.

నమ్మకం కుదరక నుదుటి మీద అరచేయి ఆనించింది. "జ్వరం ఏం లేదు, తలనొప్పా, ఏదన్నా మాత్ర యివ్వనా" మళ్లీ అడిగింది.

"ఏం వద్దు, నాకేం లేదన్నానుగా" విసుగ్గా అన్నాడు.

స్నానం చేసి ఫ్రెష్ అయి వచ్చినా భర్త మొహంలో ఏదో ఆలోచనతో సతమతమవుతున్నట్టున్నా, మళ్లీ అడిగితే విసుక్కుంటాడు, అతనే చెపుతాడని శకుంతల యింకేం మాట్లాడలేదు.

భోజనం దగ్గర కూడా అన్యమనస్కంగా కనిపించేసరికి ఇంక ఆగలేక, "ఏం లేదంటారు, ఏం లేకపోతే కొంపలు మునిగినట్టు ఆ మొహం ఎందుకలా పెట్టారు? చెప్పదలచకపోతే యింక అడగను" కోపంగా అంది శకుంతల.

ఒక్క నిమిషం అన్నం కెలికి, "పొద్దుట ఆఫీసుకి వెళ్తుంటే గీత కన్పించింది"

శకుంతల ఒక్క క్షణం చకితురాలైనట్టు చూసి, తరువాత తేలిగ్గా నవ్వేసి "ఓస్ అంతేనా, ఆపాటి దానికి మూడ్ ఆఫ్ అయిపోవాలా- పాత ప్రియురాలు కనిపిస్తే సంతోషిస్తారు గాని" వేళాకోళంగా అంది.

చురుగ్గా చూశాడు రాజారావు. "అందుకే చెప్పకూడదనుకున్నాను. నీకంతా వేళాకోళమే"

"వేళాకోళం కాదండీ- కనిపిస్తే ఏమయిందిట. మిమ్మల్ని చూసిందా తను. మీతో మాట్లాడిందా. ఎలా వుంది, ఏమంది- అసలు పలకరించిందా?" ఆరాటంగా ప్రశ్నలు కురిపించింది.

"చూడ్డం ఏమిటి, సర్రున కారు నా స్కూటరు పక్కన ఆపి దిగింది. రోడ్డుమీదే అట్టహాసంగా మాట్లాడేసింది" ఉద్విగ్నంగా అన్నాడు రాజారావు.

"చాలారోజుల తర్వాత పాత మిత్రుడు కనిపిస్తే మాట్లాడటంలో వింతేం వుంది"

"పలకరింతతో ఆగితే ఫరవాలేదు. యింటికి వస్తేగాని వీల్లేదని లాక్కుపోయింది. ఆఫీసుంది, మరోసారి వస్తానన్నా వినకుండా డ్రైవరుకి స్కూటరు అప్పజెప్పి కారెక్కమంది. ఎంత మొత్తుకున్నా వినకుండా లాక్కెళ్లింది"

"అయితే, ఆఫీసుకి వెళ్లలేదన్నమాట. మరింతసేపూ ఆవిడింట్లోనే వున్నారా" అంది ఇబ్బందిగా చూసి.

"మరేం చెయ్యను- అక్కడికెళ్లాక ఆఫీసుకి శెలవు పెట్టమని ఫోన్ చేయించింది. యివాళ భోజనం యిక్కడే అంది. వాళ్లాయన కంపెనీ పనిమీద ఢిల్లీ వెళ్లాడట. సాయంత్రం వరకు వదలను, కబుర్లు చెప్పుకోవాల్సిందే అంటూ ఒకటే హడావిడి చేసింది. అప్పటికప్పుడు వంటావిడతో చెప్పి పాయసం, వడలు వేయించి విందు భోజనం పెట్టి, అప్పటి నుంచి మొదలుపెట్టి యిప్పటి వరకు అయినవన్ని కబుర్లు చెప్పింది"

"మరింకేం... విందు భోజనం తిని, యిష్టసఖితో కాలక్షేపం చేసి వచ్చి ఏదో కొంప మునిగినట్టు మరి ఆ మొహం ఎందుకు? సంబరమే కదా... ఆముదం తాగినట్టు ఆ ఫోజేమిటి?" శకుంతల సగం చమత్కారం, సగం అసూయ కలగలిపి హేళనగా అంది.

"కబుర్లంటే ఏమున్నాయి- తన గొప్పలే. అమెరికాలో మొగుడి ఉద్యోగం, జీతం, నాలుగు పడక గదుల యిల్లు, స్విమ్మింగ్‌పూల్, పడవల్లాంటి రెండు కార్లు, అమెరికా జీవితం, ముద్దులు మూటగట్టే యిద్దరు పిల్లలు, వాళ్ల తెలివితేటలు, వాళ్ల చదువులు- ఆఖరికి ఇండియాలో యీ కంపెనీ ప్రెసిడెంటుగా నెలకు బోలెడు జీతం, బంగళా, కార్లు, ఫోన్లు అన్నీ యిస్తామంటే దేశం మీద ప్రేమతో అమెరికాలో సంపాదించిన డాలర్లు చాలు- ఎన్ని లక్షలున్నా పరాయి దేశం పరాయి దేశమే. పుట్టిన గడ్డ మీద బ్రతకాలన్న కోరిక, మాతృభూమి మీద మమకారంతో దేశానికి సేవ చేద్దామన్న ఆలోచన వచ్చి సరేనని వచ్చారుట. జూబ్లీహిల్స్‌లో లంకంత బంగళా, గార్డెన్, ఆ ఫర్నిచరు, ఆ బోంసాయ్ మొక్కలు హాబీగా ఎలా పెంచుతోందో, ఎన్ని క్లబ్బుల్లో మెంబర్లో... ఎంతమంది వి.ఐ.పి.లతో పరిచయమో... చెవుల్లో దుమ్మువదలి పోయిందనుకో..."

"అన్నీ బాగానే వున్నాయి, మీరెందుకు అలా వున్నారని అడుగుతున్నాను"

రాజారావు కాసేపు మాట్లాడకుండా తలదించుకు కూర్చున్నాడు. తరువాత తలెత్తాడు.

"ఏమిటో మళ్లీ అప్పటిలాగే తనముందు నేనో చీమనో, దోమనో అయిపోయినట్టు న్యూనతాభావం... ఏదో హాయిగా బతుకుతున్న నా జీవితంలోకి మళ్లీ వచ్చి, ఆ రోజులు జ్ఞాపకంలోకి తెచ్చి ప్రశాంతంగా పారుతున్న నదిలోకి రాయి విసిరినట్టు ఏమిటోలా అన్పించింది" శకుంతల వంక చూస్తూ నిజాయితీగా అన్నాడు.

"అంటే మీకింకా ఆమె మనసులోంచి పోలేదన్నమాట..."

"ఛా... ఛా... అదేంకాదు..." గాభరాగా అన్నాడు.

"అదేం లేకపోతే, ఏదో పాత ఫ్రెండు కన్పించింది, మాట్లాడింది అనుకుని మామూలుగా వుండచ్చుగా... ఎప్పుడో, ఎక్కడో పాత తెలిసినవారు కనిపిస్తే యిలాగే రియాక్ట్ అవం గదా. మీరెందుకు యీ సంఘటనకి యింత ప్రాముఖ్యం యివ్వడం..."

"ఏమో నాకు తెలియదు. నీకు తెలుసుగా తన మాటలు, ఇతరులని తనవైపు తిప్పుకునే చాకచక్యం, ఆ కన్నింగ్‌నెస్, ఎందుకో నా మీద అవసరాన్ని మించిన శ్రద్ధ చూపించడం... నాకెందుకో భయం, అనవసరంగా యిన్నేళ్ల తరువాత తనిలా రావడం నా ప్రశాంతతని భగ్నం చేస్తుందేమోనని... మళ్లీ నా జోక్యం లేకుండా నా ఆలోచనల్లో జొరబడి..." గొణిగాడు.

"చాల్లెండి బడాయి... పెద్ద మీరేదో చాలా గొప్పవారు, మీ కోసం ఆవిడ ఏడుస్తున్నట్టు భ్రమించి, మీకు మీరే ప్రాముఖ్యం అంటగట్టేసుకుని ఊరికే పోరుపెట్టకండి. మీరేం చిన్న కుర్రాళ్లా. యాభై ఏళ్లు వచ్చాయి. ఆవిడకి పెద్ద పెద్ద పిల్లలు. విలాసవంతమైన జీవితం, లక్షలార్జించే మొగుడు అన్నీ వుండగా ఏదో మీలాంటి వాడిమీద ఏదో ఇంట్రెస్ట్ వుందన్నట్టు ఆలోచించడం బాగులేదు. కాలేజీ రోజులు, తెలిసీ తెలియని వయసు. ప్రేమ అనుకుని మనసులు పారేసుకుని దేవదాసులయిపోవడం కుర్రాళ్లకి మామూలే. మీరింకా ఆ స్టేజిలోనే వున్నాననుకోకండి" వ్యంగ్యంగా ఎత్తిపొడుస్తూ నవ్వింది శకుంతల.

శకుంతలకి వున్న నమ్మకం తనమీద తనకు లేదు. అతనికి తెలుసు ఆ సంగతి. గీత సంగతి తెలిసిన అతనికి, గీతంటే తనకున్న బలహీనత గురించి వయసుతో సంబంధం లేని ఆ ఆకర్షణ నుంచి తను తప్పించుకోలేదన్నది అతని భయం. ఆ విషయం శకుంతలకి అర్థం అయ్యేట్టు చెప్పడం అతనికి చేతకాదు.

✦ ✦ ✦

"హాయ్... ఏం చేస్తున్నావు? మళ్లీ ఫోనన్నా చెయ్యలేదు" ఫోన్‌లోనే ముద్దులు గుసుస్తున్నట్లంది గీత.

గతుక్కుమన్నాడు రాజారావు గీత గొంతు విని.

"ఆఁ ఏం లేదు. ఏముంది మాట్లాడడానికి. సంగతులేం వున్నాయి" గొణిగాడు.

"సంగతులు లేకపోతే మాట్లాడకూడదా. మాట్లాడుకోడానికి సంగతులే వుండాలా" కవ్విస్తున్నట్లంది.

రాజారావు మౌనంగా వూరుకున్నాడు.

"సర్లే... ఫోన్‌లో మాట్లాడడానికి సంగతులు లేవు. యింటికి రా, నే చెపుతా బోలెడు సంగతులు..." ఊరిస్తున్నట్లంది.

"ఏయ్... ఏమిటి మాట్లాడవు. యిప్పుడు రారాదూ. మా శ్రీవారు ఢిల్లీ వెళ్లారు. బోరు కొడ్తోంది. కాసేపు సరదాగా గడుపుదాం రా. కారు పంపనా, వచ్చేస్తావా"

"పిలవగానే పరిగెత్తి వచ్చేస్తాడని ఎంత నమ్మకం. వాళ్లాయన లేనపుడు తను కంపెనీ యివ్వాలన్నమాట" ఉడుక్కున్నాడు రాజారావు.

"కుదరదు. ఆఫీసు టైములో ఎలా వస్తాను, రాలేను. ఇంకోసారి ఎప్పుడన్నా శెలవురోజు వస్తా... సారీ!" అంటూ ఫోన్ పెట్టేశాడు.


మళ్లీ నిముషంలో రింగయింది.

"ఏమిటలా ఫోన్ కట్ చేశావు, మాట్లాడుతుంటే..." కినుకగా అని, "పోనీ ఆఫీసయ్యాక రా, ఎదురు చూస్తుంటాను. డోంట్ డిసప్పాయింట్ మి! ఏం... సీయూ ఇన్‌ద యీవెనింగ్" అంటూ అతను ఏదన్నా అనే లోపలే ఫోన్ పెట్టేసింది.

రాజారావు ఇగో హర్ట్ అయింది.

"ఆవిడగారెప్పుడు రా... అంటే తోకాడించుకుంటూ పరిగెట్టి వస్తానని కాబోలు- తన ఉద్దేశం. ఆ కాలేజీ నాటి టీనేజ్ రాజా అనుకుంటోంది కాబోలు. వెళ్లను గాక వెళ్లను..." కసిగా అనుకున్నాడు.

ఇంటికెళ్లాక శకుంతలకు చెప్పాడు ఏం అంటుందో చూడాలని. ఎందుకో గీత సంగతులు శకుంతల దగ్గర దాచాలనిపించడం లేదు. శకుంతల బ్యాలెన్స్‌డ్‌గానే ఆలోచించే మనిషి. నిజంగా ఆ రోజుల్లో శకుంతలే లేకపోతే, గీత చేసి వెళ్లిన గాయాన్ని అంత తొందరగా



మాన్పుకోలేకపోయేవాడు. మండే గుండెకి మంచి గంధం పూసి చల్లబరిచింది శకుంతల.

"వెళ్ళకపోయారా అంత ప్రేమగా పిలిస్తే" హాస్యంగా అంది శకుంతల.

రాజారావు కోపంగా చూశాడు.

"నీకు హాస్యంగా వున్నట్టుంది. నిజంగా వెడితే ఏడుస్తావు"

"నేనేం ఏడవను– వెళ్ళండి, వెళ్ళండి" కవ్వించింది.

"హాస్యాలు చాలించు" కసిరాడు చిరాగ్గా.

"అవునూ, అసలు గీత ఉద్దేశం ఏమిటంటావు... ఎందుకు యిన్నేళ్ళ తరువాత మళ్ళీ నాతో స్నేహం పునరుద్ధరించుకోవాలను కుంటోందంటావ్..."

"స్నేహమా, పాడా... ఆవిడకి తన గొప్పలు చూపుకోవడానికి, కాలక్షేపానికి, తన వెంట యింకా మగవాళ్ళు పడతారో, లేదో పరీక్షించడానికి... ఇంకా చెప్పాలంటే ఓ గేమ్ ఆడి చూడాలన్న సరదా..." తేలిగ్గా అంది శకుంతల.

"అంతేనంటావా, యీ వయసులో కూడా యింకా అలా ఆలోచిస్తుందంటావా"

"ఆవిడ మనస్తత్వం అది. అందరూ తన చుట్టూ తిరగాలనే ఆవిడ బుద్ధి మనం ఎరగనిదా. డబ్బు కోసం డబ్బున్న వాడిని వెతుక్కుంది. లక్షల రూపాయలిచ్చే సుఖాలు, అనుభవాలు పాతబడ్డాయి. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. మొగుడు ఉద్యోగంలో బిజీ. యీవిడకి ఏదో కాలక్షేపం కావాలి. దానికి మీరు దొరికారు. ఆనాటి మీ ప్రేమావేశాలు ఎలా వున్నాయో, అసలు మీరెలా వున్నారో... అవన్నీ తెలుసుకోవాలన్న ఆరాటం ఆవిడకి. మీరింకా ఆవిడ పట్ల పాత అనుభూతులతో ఆవిడ పొందుకోరి వస్తారో లేదోనని పరీక్షించాలని ఉత్సుకత. మీరెడితే మళ్ళీ పాత రోజుల్లా మిమ్మల్ని వెంట తిప్పుకుని సరదాగా ఓ కాలక్షేపంగా వుంటుందని అనుకుంటోందేమో ననిపిస్తోంది నాకు. మీ వైవాహిక జీవితం ఎలా వుందో తెలుసుకోవాలన్న ఆరాటం... అన్నీ వున్నాయి"

"అందుకే నాకు వెళ్ళాలనిపించడం లేదు"

"అలా కాదు, అసలు ఓసారి వెళ్ళి చూడండి. అసలు ఆవిడ ఉద్దేశం అర్థం అవుతుంది. మీరెక్కడ బయటపడకుండా మీరు చాలా ప్రశాంతంగా జీవిస్తున్నట్టు, వున్న దానితో తృప్తిగా, హ్యాపీగా గడుపుతున్నట్టు, ఆ రోజులు కాలేజీ రోజులు ఏవో అందరూ టీనేజ్‌లో అలాగే ప్రవర్తిస్తారన్నట్టు తేలిగ్గా మాట్లాడండి. అప్పుడు ఆవిడ ధోరణి ఎలా వుంటుందో చూడండి"

"నీవూ రా... మనిద్దరం ఓ ఆదివారం కలిసి వెళదాం. మనల్ని చూసి ఆవిడంతట ఆవిడే గ్రహించొచ్చు. కేవలం స్నేహం కోసం అయితే ఫరవాలేదు, అప్పుడప్పుడు కలవొచ్చు మనం."

"ఉహుఁ నేను రాను. మీరు ముందు వెళ్ళండి. ఆమె కేవలం స్నేహం కోసమే ఆరాటపడుతోంది అనిపిస్తే చెప్పండి. అప్పుడు వస్తాను."

రాజారావు ఇబ్బందిగా చూశాడు.

''ఏమిటీ, ఆవిడేదో మీద పడుతున్నంత భయపడుతున్నారు? పడితే మంచిమాటేగా మీ మగాళ్ళకి" చిలిపిగా అంది.

కోపంగా చూశాడు రాజారావు.

✦ ✦ ✦

''నిన్న వస్తావనుకున్నాను. చాలాసేపు ఎదురుచూశాను. డిసప్పాయింట్ చేశావు. కనీసం రాలేనని ఫోనన్నా చెయ్యకూడదా" నిష్ఠూరంగా అంది ఆఫీసుకి ఫోన్ చేసి.

"కుదరలేదు. ఇంటికి వెళ్ళేసరికి గెస్ట్‌లు వచ్చారు" చిన్న అబద్ధం ఆడేశాడు.

"పోనీ, యివాళ వస్తావా" ఆశగా అంది.

"మళ్ళీ రేపు సాయంత్రం ఆయనొచ్చేస్తారు. మనం ఫ్రీగా మాట్లాడుకోవచ్చు ఇవాళయితే"

"కుదరకపోవచ్చు... ఆఫీసు పని పూర్తయితే చూస్తాను" ముభావంగా అన్నాడు.

"ఏయ్ రాజా, ఎందుకలా మాట్లాడుతున్నావ్! నన్ను ఎవాయిడ్ చెయ్యాలనుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఎందుకు..." హర్ట్ అయినట్టు అడిగింది.

''ఎందుకో నీకు తెలీదా...'' అనకుండా ఉండలేకపోయాడు. అతని గొంతులోంచి అతనికి తెలియకుండానే వాడిగా వచ్చాయి మాటలు.

"ఇంకా, పాత సంగతి మర్చిపోలేదా. ఎప్పుడో తెలిసీ తెలియని వయసులో ఏదో అనుకుంటాం, ఏదో చేస్తాం. అదింకా సీరియస్‌గానే తీసుకుంటున్నావా"

"మళ్ళీ పాత సంగతులు గుర్తుకు రాకుండా వుండడం కోసమే రానంటున్నాను" ముభావంగా అన్నాడు.

"అవి గుర్తుకు తెచ్చుకోవడం నాకిష్టం లేదు" అని కూడా చేర్చాడు.

ఆ మాటలకి హర్ట్ అయినట్టు ఒక్క క్షణం మౌనం అటునుంచి– "ఏదో కాలేజీ నాటి స్నేహితుడివి కనిపించగానే సంతోషం అనిపించి, పిలిచాను..." నిష్ఠూరంగా అంది.

"ఏమో, నాకు తీరిక లేదు, కోరికా లేదు కలవాలని. ఏదో ప్రశాంతంగా జీవితం దొర్లిపోతోంది. మళ్ళీ అనవసరంగా ఆ ప్రశాంతతని భగ్నం చేసుకోవడం నాకిష్టం లేదు. క్షమించు..." సడన్‌గా ఫోను పెట్టేశాడు. ఆమెని అలా కట్ చేసినందుకు, చేయగల్గినందుకు తనని తానే మెచ్చుకున్నాడు.

"ఇంక ఈ దెబ్బతో తన జోలికి రాదు మళ్ళీ" అనుకున్నాడు.

✦ ✦ ✦

మూడు రోజుల తరువాత, ఆదివారం నాలుగ్గంటల వేళ నిద్రలేచి బద్ధకంగా కాఫీ తాగుతుంటే, బయట కారు చప్పుడు, ఆ తర్వాత గేటు చప్పుడు వినిపించి అటు చూసేలోగానే గుమ్మం దగ్గరికి వచ్చేసింది గీత.

ఆమెని చూసి సంభ్రమంగా లేచి, అట్టహాసంగా ఆహ్వానించి చకచకా లోపలికెళ్లి బట్టలు మార్చేసి, తల దువ్వుకుని రావాలనిపించలేదు అతనికి.

"ఓః మీరా... రండి!" లేచీలేవనట్టు కుర్చీలోంచి లేచి, మరో కుర్చీ చూపించి, "శకూ... ఎవరొచ్చారో చూడు!" అంటూ వంటింటి వైపు కేకపెట్టాడు.

"ఎక్స్క్యూజ్‌మీ" అంటూ అప్పుడు లేచి, లోపలికెళ్లి లుంగీమీద బెంగాలీ షర్ట్ వేసుకుని బయటికి వచ్చాడు.

శకుంతల లోపల్నించి వచ్చి ఆశ్చర్యంగా, "మీరా" అంది.

"హలో... ఎలా వున్నావు. ఏమిటి, కొత్తగా మీరు అంటున్నావు..." శకుంతలని ఆపాదమస్తకం పరీక్షిస్తూ విలాసంగా నవ్వింది.

"మీ ఆయన ఏమిటి కొండెక్కి కూర్చున్నాడు. యింటికి రమ్మని సరదాగా పిలిస్తే... ఏం చేస్తాం! మహమ్మదు రాకపోతే మౌంటెనే వెళ్లాలి మరి" అంది రాజారావు వంక చిలిపిగా చూసి.

"ఈ మహమ్మదు గార్కి మౌంటెన్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం కనపడలేదేమో, ఇంట్రెస్ట్ పోయుంటుంది" తను గడుసుగానే అంది నవ్వి.

"ఏం తీసుకుంటారు... కాఫీ, టీ..."

"అదిగో, మళ్లీ మీరు అంటూ యీ మర్యాద ఏమిటి?" చనువుగా మందలించింది.

"ఇప్పుడు మీరు పెద్దవారు, గొప్పవారు. నీవు అనచ్చో, లేదోనని..."

"ఏమిటయ్యా బాబూ... ఆముదం తాగినట్టు ఆ మొహం. ఎందుకొచ్చానా అనుకుంటున్నావా?"

రాజారావు నవ్వీ నవ్వనట్టు నవ్వి, "నిజమే, ఈ బీదవాడి ఇంటికి దేనికొచ్చావు, నాతో పని ఏమిటా అని అనుకుంటున్నాను" అన్నాడు.

శకుంతల "కాఫీ తెస్తాను" అంటూ లేచి వెళ్లింది.

గీత ఆ అవకాశాన్ని వదలకుండా, "ఎందుకలా మాట్లాడతావు. స్నేహానికి బీదేమిటి, గొప్పేమిటి?"

"అవును. స్నేహానికి అక్కరలేదు నిజమే- పెళ్లికి కావాలి అవన్నీ. ఆ తేడాలన్నీ చూసుకోవాలి" కసిగా అన్నాడు.

కాస్త తెల్లబోయి అంతలోనే తేలిగ్గా నవ్వేసి, "అవును మరి, నాలుగూ చూసుకోకుండా పెళ్లెలా చేసుకుంటారు ఎవరన్నా. అంతస్తు, హోదా, కుటుంబం, ఉద్యోగం... ఎన్ని చూసుకోవాలి..." ఆరిందాలా ఏం తెలీనట్లుంది.

"నీకింకా నా మీద కోపం పోనట్టుంది... అవునా?" కవ్వింపుగా అంది.

"నాకేం కోపం! కోపం ఎందుకు? హాయిగా వున్నాను. ఉన్నంతలో చీకూచింతా లేని జీవితం, అనుకూలవతైన భార్య, చక్కగా చదువుకుంటున్న పిల్లలు, ఉండడానికో కొంప, చెయ్యడానికో ఉద్యోగం, నాకేం లోటు? హాయిగా మనశ్శాంతిగా, సుఖంగా ఉన్నాను. నిజంగా శకుంతల నాకు దొరికిన అదృష్టం. నిజంగా సహధర్మచారిణి అన్న పదానికి నిర్వచనం ఆమె. ఆమెని మించిన ఐశ్వర్యం నాకేం అక్కరలేదు" చాలా గర్వంగా, నిజంగా ఫీలయ్యే అన్న మాటలు అవి. గీతకి తను ఆమెని కోల్పోయి ఏం బాధపడడం లేదు అని చెప్పాలన్న తాపత్రయం మాత్రం వుంది.

గీత మొహం కాస్త ఎర్రబడింది. అంతలో తేలిగ్గా నవ్వేసి,

"అబ్బో... మహా పొగిడేసుకుంటున్నావు భార్యని. యింకా అందగత్తె, గొప్ప యింటిది దొరికుంటే..." చిన్నగా లో గొంతులో అంది. కాస్త అసూయ ధ్వనించింది ఆ మాటల్లో.

రాజారావు ఏదో అనే లోపలే కాఫీ కప్పులతో శకుంతల వచ్చింది.

మాట చప్పున మార్చేసి నవ్వుతూ, "శకుంతలా! మీవారు నిన్ను అందలం ఎక్కించేశారు. తెగ పొగిడేస్తున్నారు. నీవంటి భార్య దొరకడం అదృష్టంట" కవ్విస్తూ అంది.

"ఆశించినవి దొరకనపుడు, దొరికిన దానితో సంతృప్తి పడడం గొప్ప విషయమేగా. లేనిదాని కోసం ఏడవడం కంటే, దొరికిన దానికి సంతోషించడం తెలివైనవారు చేసే పని. మా ఆయనకి ఆ మాత్రం తెలివితేటలున్నాయి మరి" గడుసుగా అంది.

"అబ్బో... ఒకరినొకరు అంత పొగిడేసుకుని నన్ను కుళ్లించాలనా" హాస్యంగా అంది.

"మమ్మల్ని చూసి కుళ్లే స్థితిలో నిజంగా మీరుంటే మరి మేం జాలిపడాలి" గడుసుగా మళ్లీ అంది.

గీత మొహం ఎర్రబడింది.

"మాటల్లో నిన్నోడించడం కష్టంలే, నీవు చాలా తెలివైనదానివి, గడుసుదానివి" కాస్త అక్కసు చూపింది.

"మనిషన్నాక ఏదో ఒక క్వాలిఫికేషన్ ఉండాలిగా. నా క్వాలిఫికేషన్ అదేమో" నవ్వింది.

రాజారావు బుద్ధుడిలా యిద్దరి మాటలు వింటూ చిద్విలాసంగా నవ్వుకుంటూ కూర్చున్నాడు అంతసేపూ.

"గీతా! ఒక్క విషయం మాత్రం నాకీ పాతికేళ్లలో బాగా అర్థం అయింది. చూడు- జలపాతం సౌందర్యాన్ని చూసి అబ్బురపడతాం, ఆనందపడతాం, ఆశ్చర్యపోతాం. ఆ ఆనందాన్ని శాశ్వతం చేసుకుంటే బాగుంటుందనిపిస్తుంది. కానీ నిజంగా అలా జరిగితే ఆనందం అటుంచి, ఎప్పుడు అక్కడి నుంచి పారిపోదాం అనిపిస్తుంది. ఆ హోరు, ఆ నీటి తాకిడి చూస్తూ భరించలేక ప్రశాంతత కోసం, హాయిగా నిశ్శబ్దంగా, మెల్లగా, చల్లగా పారే ఏ నీటి ఒడ్డుకో పోరిపోయి ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే చోటు వెతుక్కుంటాం- ఎంతటి సౌందర్యాన్నైనా కొద్దిసేపే భరించగలం- ఏ అందాన్నైనా ప్రశాంతంగా ఆహ్వానించగలం గాని, నీటి హోరు మధ్య కొన్ని గంటలు బాగున్నట్టు జీవితకాలం బాగుండదు. మనిషికి మానసిక శాంతి కావాలి. అందం నాలుగు రోజులే మురిపిస్తుంది. మనిషిలోని అంతః సౌందర్యం మనిషికి ఊరటని, ప్రశాంతతని యిచ్చి జీవితం సాఫీగా సాగేట్టు చేస్తుందన్న సత్యం గ్రహించాను. నేను కోరుకున్న ప్రశాంతత నాకు దొరికింది. నో రిగ్రెట్స్ యిన్ లైఫ్- నేను దొరికిన దానితో చాలా సంతోషంగా వున్నాను. నాకీ తృప్తి చాలు-'' అతను మాట్లాడుతున్నంతసేపూ గీత మొహంలో రంగులు మారాయి.

"అంటే- ఆవిడ జలపాతం, నేను పారే నదిననా మీ పోలిక-" శకుంతల హాస్యంగా అంది.

గీత మొహం కాస్త నల్లబడి అంతలోనే తేరుకుని తనూ హాస్యంగానే, "అందని ద్రాక్ష పుల్లన- అన్నది ఎవరూ ఒప్పుకోరుగా"

"ఎవరెలా అయినా అనుకోండి- ఎవరికి కావాల్సిన అర్థాలు వారు వెతుక్కోవచ్చు. నాకేం అభ్యంతరం లేదు. నా జీవితం హాయిగా వుంది. యింక ఎవరేం అనుకుంటే నాకేం బాధ"

"యింక చాల్లెండి. మళ్లీ మళ్లీ మీరామాట అంటే ఆవిడకి కోపం వచ్చేసి, టి.వి. సీరియల్‌లో మాదిరి, 'నిన్ను సుఖపడనీయను, నాకు దక్కనిది నీకు దక్కనీయను, నిన్ను ప్రశాంతంగా బతకనీయను' అంటూ ప్రతిజ్ఞ చేసేయొచ్చు" గలగలా నవ్వింది.

గీత మొహం ఉక్రోషంతో ఎర్రబడింది.

"ఆహాః యిద్దరికిద్దరు ఎంతో తెలివిగా- మీ యిద్దరూ చాలా సంతోషంగా, చాలా అన్యోన్యంగా వున్నట్టు యింప్రెషన్ యివ్వాలని ఎంత తాపత్రయపడుతున్నారో చూస్తే జాలేస్తోంది. ఏదో తెల్సిన వాళ్లని చూసి పోదామని వచ్చానంతే. మిమ్మల్ని చూసి ఉడుక్కోవలసిన ఖర్మ నాకేంటి- లక్షల ఆస్తి, కార్లు, రత్నాల లాంటి పిల్లలు, గీచిన గీటు దాటని మొగుడు" గర్వంగా తలెగరేసి అంది.

రాజారావు అదోలా నవ్వాడు- శకుంతల వైపు చూస్తూ "పాపం గీత... యింకా పాత రాజారావనే అనుకుంటోంది" నర్మగర్భంగా అన్నాడు.

శకుంతల ముసిముసి నవ్వులు నవ్వింది. ఆ నవ్వులు చూసేసరికి తిక్కరేగింది గీతకి.

"ఐ పిటీ యూ రాజారావ్! 'అల్పుడెపుడు బల్కు ఆడంబరముగా' అన్న పద్యం జ్ఞాపకం వస్తోంది మీ యిద్దరి మాటలు వింటుంటే. లేనిది వున్నట్టుగా చూపుకోవడం కోసం మీ తాపత్రయం చూస్తే జాలేస్తోంది" మొహాన నవ్వు పులుముకున్నా మాటలు కసిగా వత్తింది.

"అరే, స్ట్రేంజ్ కోయిన్సిడెన్స్- నాకూ చిన్నప్పుడు చదివిన 'ఎలుక తోక తెచ్చి ఎంత ఉతికినా' పద్యం- 'పుటుకతో వచ్చిన బుద్ధి పుడకలతోగాని పోదు' అన్న సామెత ఎంత నిజం అనిపించింది" నవ్వుతూ అన్నాడు.

గీత విసురుగా లేచి నిల్చుని, "ఛీ... నీలాంటి వాడింటికి పిలవని పేరంటం రావడం నాదే బుద్ధి తక్కువ" అని వెళ్లబోతుంటే వెనకనుంచి,

"నిజమే, నీలాంటి వారు రాదగ్గ చోటు కాదిది" అన్నాడు రాజారావు కూల్‌గా.

ఆ మాటన్నాక పాతికేళ్లుగా పేరుకున్న బాధ, అవమానం, కసి చేత్తో తీసిపారేసినంతగా మనసు తేలికపడ్డట్టు అనిపించింది రాజారావుకి. నచ్చని అక్షరాలు చెరిపేసిన తెల్ల కాగితంలా మనసు తేటపడింది. ●

## జీవితం

మరణించాక
కలగంటున్నట్టుంది
పంటి తీపులా
జివ్వున లాగేస్తుంది
'తీపు' అంటే
'తియ్యన' 'బాధ'- రెండర్థాలు
కొందరు
జీవితం 'తియ్యన'
అని భ్రమిస్తారు.

- కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి